క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మాఘమాసంలో ప్రారంభమైన ఏడు శనివారాల వ్రతంలో భాగంగా ఆరో శనివారం ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, తులసి పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా హేమ



హేమను అభినందిస్తున్న అధ్యాపకులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.హేమ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి శుక్రవారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఇదే కళాశాలలో బోటనీ అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న హేమ శనివారం ఉదయం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇప్పటి వరకూ ఇక్కడ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన వి.శ్రీనివాసరావు జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన హేమను కళాశాల అధ్యాపకులు మాధురి, పద్మావతి, శేఖర్ బాబు, రమణ, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, శ్యామలారావు, కృష్ణ, శ్రీనివాస్, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి

సీతానగరం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు పేర్కొన్నారు. శనివారం సీతానగరంలోని ఎనిమిది అంగన్‌వాడీ సెంటర్లు సంయుక్తంగా సచివాలయం–2లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పెదలక్ష్మి అధ్యక్షతన జరిగిన పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీహెచ్‌సీ డాక్టర్ రాజు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోందని, సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం అయిదుగురి సీమంతం చేశారు. సీహెచ్‌ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు ఎన్.ఉమామహేశ్వరి, ఎస్.లక్ష్మీకాంతం, టి.విజయ, ఏ శ్రీదేవి, ఎం.పుష్పరత్నం, ఎం.పద్మావతి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మఠం భూమి కౌలుకు 20న బహిరంగ వేలం

సీతానగరం: కాటవరంలో ఉన్న 21.24 ఎకరాల్లో మెరక భూమిని ఈనెల 20న దేవదాయ శాఖ అధికారులతో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు గోడాడ గోషాయి మఠం కార్యనిర్వహణాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన శ్రీగోడాడ గోషాయి మఠానికి చెందిన భూమి సీతానగరం మండలం కాటవరంలో 21.24 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 20న ఉదయం 10 గంటలకు కాటవరం పంచాయతీ కార్యాలయం వద్ద దేవదాయశాఖ అధికారులు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తామని సంస్థ కార్యనిర్వహణాధికారి తెలిపారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా దొరబాబు



సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దొరబాబును సత్కరిస్తున్న అధ్యాపకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిక్కం దొరబాబు శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన గణిత అధ్యాపకులు చిక్కం దొరబాబు సీతానగరం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా సాయంత్రం 6.45 గంటలకు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ కళాశాల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడానికి ప్రయత్నిస్తానని అన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపాల్ దొరబాబును దుశ్శాలువాతో సత్కరించారు.

జగన్‌తో పేదల సొంతింటి కల సాకారం

- నవరత్నాలతో ప్రతి ఒక్కరికీ ప్రయోజనం
- నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి సుడిగాలి పర్యటన
- ఒకే రోజు 2,888 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



దివాన్‌చెరువులో టీడీపీ నాయకురాలు ఖండవల్లి లక్ష్మికి ఇంటి స్థల పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు సుడిగాలి పర్యటన చేసిన ఆయన వివిధ గ్రామాలలో 2,888 మందికి నివాస స్థలాల పట్టాలను తన సతీమణి డాక్టర్ రాజశ్రీ, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వం మాదిరిగా కుల, మత, వర్గ, రాజకీయాలు చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వం నవరత్న పథకాలను అందించిందన్నారు. పేదలకు మేలు చేసే జగనన్న సర్కారును రాబోయే ఎన్నికలలో మరోసారి అధికారంలోకి తీసుకురావాలని, ఫ్యాను గుర్తుకు ఓటు చేయాలని కోరారు. అర్హత ఉన్నవారందరికీ ఇళ్ల స్థలాలు అందించామన్నారు. శ్రీకృష్ణపట్నంలో 263 మందికి, లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో 1147 మందికి, వెలుగుబందలో 767 మందికి, గాదరాడలో 355 మందికి, కూనవరంలో 199 మందికి, మునికూడలి 157 మందికి నివాస స్థలాల పట్టాలను ఎమ్మెల్యే అందజేశారు. వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గతంలో పేదలకు అరకొరగా నివాస స్థలాలు ఇచ్చేవారని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఒకేసారి 31 లక్షలకు పైగా నివాస స్థలాల పట్టాలు పంపిణీ చేశారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో కూడా 20,172 మందికి ఇల్ల పట్టాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంధం నారాయణరావు, గంగిశెట్టి సోమేశ్వరావు, కోలపాటి వెంకన్న, వేమగిరి కృష్ణ, వాడ్రేవు శ్రీనివాస్‌కుమార్, కామేశ్వరావు, మార్గాని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గాదరాడలో 366 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం గాద రాడ సచివాలయంలో 366 మంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో–కన్వీనర్ గణేశుల పోసయ్య, నాయకులు పాల్గొన్నారు.

సింగంపల్లి అభివృద్ధికి మరింత కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- 30 మంది అర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీ



సింగంపల్లిలో మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: గడచిన ఐదేళ్ల కాలంలో సింగంపల్లి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం సింగంపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన 30 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందించి, అనంతరం మాట్లాడారు. సింగంపల్లి గ్రామంలో ఇప్పటికే 300 మందికి ఇళ్ల పట్టాలు అందించామని, మరో 30 మందికి తాజాగా అందించామన్నారు. రోడ్లు, డ్రైన్లు, ఆర్బీకే, వెల్‌నెస్, సచివాలయం తదితర భవనాలు నిర్మించామన్నారు. పాఠశాల, కళాశాల అభివృద్ధి, విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు తదితర అభివృద్ధి చేశామన్నారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్ టి. శివ శంకర్ ఆనంద్, ఎంపీటీసీ సుబ్బన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

జక్కంపూడి విజయలక్ష్మి



ఆటో కార్మికుల సంక్షేమ భవనానికి శంకుస్థాపన చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో ఆటో కార్మికుల సంక్షేమానికి జగనన్న సర్కారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, పని చేస్తోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ భవనం కోసం రాజానగరంలో కేటాయించిన మూడు సెంట్ల భూమిలో భవన నిర్మాణానికి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మీ సేవలను ఉపయోగించుకున్నాయేగాని, సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో తొలిసారిగా ఆటో కార్మికులకు ఏటా ఒక్కొక్కరికీ రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మనల్ని పట్టించుకోని వారి గురించి ఆలోచించడం కంటే మన శ్రేయస్సు గురించి ఆలోచించే జగనన్న సర్కారును మరొకసారి అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తొలుత స్థానిక ఆటో యూనియన్ అధ్యక్షుడు మట్టా శ్రీను, మండల వైఎస్సార్ సీపీ ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు పల్లెబోయిన రమణ, శ్రీలక్ష్మీగణపతి ఆటో యూనియన్ కార్మికులు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుండి గాంధీ బొమ్మ సెంటరు మీదుగా వైఎస్సార్ జంక్షన్ వరకు భారీ ఎత్తున ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలచర్లలో నూతనంగా ఏర్పాటు చేసే ఓపెన్ జిమ్ పనులకు జక్కంపూడి విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉపసర్పంచ్ కొల్లి వీర్రాజు, ఎంపీటీసీ సభ్యుడు వల్లభశెట్టి రమణ, నాయకులు ప్రగడ చక్రి, ఆకుల శ్రీను, సంగీత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

రామేశ్వరంలో ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ప్రచారం



రామేశ్వరంలో ఇంటింటా ప్రచారం చేస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కరపత్రం అందజేస్తున్న ఆదిలక్ష్మి

పెదపూడి: పేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను చూసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ప్రజలను అభ్యర్థించారు. రామేశ్వరం గ్రామంలో స్థానిక, నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మే 13నజరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తన భర్త, ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, సీఎంగా జగనన్నను, ఎంపీగా గూడూరు శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి కొటికలపూడి గణేష్, ఉప సర్పంచి దూళ్ల వీరవెంకటసత్యనారాయణ, స్థానిక పార్టీ నాయకులు తిమరులశెట్టి వెంకటరమణ, నక్కా రాజు, రాయుడు ఆనంద తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల అభ్యర్థిత్వంపై హర్షాతిరేకాలు



ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి తిరుపతి లడ్డూ తినిపించి తమ ఆనందాన్ని పంచుకుంటున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ, అనపర్తి అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అనపర్తి నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ప్రకటించడంతో నియోజకవర్గ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని రామవరంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులకు బాణసంచా కాల్పులతో సంబరాలు చేసుకున్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైద్యుల విజయాన్ని కాంక్షిస్తూ పూజలు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి తిరుపతి లడ్డూ ప్రసాదం తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని అన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకుగాను అభ్యర్థుల ఎంపిక విషయంలో సామాజిక సమీకరణాలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యతనివ్వటం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని అన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అవినీతి రహితంగా, పూర్తి పారదర్శక పాలన అందించడం ద్వారా నియోజకవర్గ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. మే 13 జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి గతం కంటె ఎక్కువ మెజార్టీతో విజయాన్ని అందుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకువెళతారని అన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు మరింత కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, గ్రామ కమిటీ కన్వీనర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా రెండు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

బిక్కవోలు: మండలంలోని కొత్తగా రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ–1 సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి వరకు మండలంలోని బిక్కవోలు, పందలపాక, బలభద్రపురం కేంద్రాలు ఉండేవని అన్నారు. ఈ ఏడాది మరో రెండు కేంద్రాలు ఇలపల్లి, పందలపాకను ఏర్పాటు చేశారన్నారు. మండలం వ్యాప్తంగా 680 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని తెలిపారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద బిక్కవోలు, ఇలపల్లి గ్రామాల్లో ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థులు, బిక్కవోలులో ఉన్న నేతాజీ, సూర్యతేజ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు కలిసి 225 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పందలపాక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం(ఎ) వద్ద పందలపాక, ఊలపల్లి, కొంకుదురు, మెళ్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 197 మంది, పందలపాక (బీ) వద్ద పందలపాక, ఊలపల్లి, కొంకుదురు, మెళ్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు 150 మంది పరీక్ష రాస్తున్నారు. బలభద్రపురం ఉన్నత పాఠశాల వద్ద బలభద్రపురం ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థులు 108 మంది పరీక్ష రాస్తున్నారు. ఇలపల్లి ఉన్నత పాఠశాల వద్ద బిక్కవోలు ప్రభుత్వం ఉన్నత పాఠశాల, బిక్కవోలు నేతాజీ, సూర్య తేజ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు 108 మంది పరీక్ష రాస్తున్నారు. పరీక్ష సమయం కన్నా గంట ముందు పరీక్ష హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు.

రాజానగరం మండలంలో 9 కేంద్రాలు

రాజానగరం: ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు మండలంలో 9 కేంద్రాలను ఎంపిక చేశామని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి 1095 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. అలాగే మరో 518 మంది సప్లిమెంటరీ విద్యార్థులు కూడా పరీక్షలు రాస్తారన్నారు. వీరందరికీ అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించడంతోపాటు హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రతి కేంద్రం వద్ద శాంతిభద్రతల పర్యవేక్షణకుగాను గట్టి పోలీసు బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

సీతానగరం: పదో తరగతి పరీక్షలకు అన్ని సిద్ధం చేసినట్టు ఎంఈఓ కె.స్వామినాయక్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నాలుగు కేంద్రాల్లో 830 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



రాజానగరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని సందర్భంగా స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి శనివారం పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అందరికీ స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

సీతానగరం: ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఎనలేని కృషితోపాటు ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు సేవలు కొనియాడదగినివి అని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు పేర్కొన్నారు. శనివారం సీతానగరం మదర్ థెరిసా సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహంతోపాటుగా మహాత్మాగాంధీ, మదర్‌థెరిసా, వైఎస్సార్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, కోలా శ్రీను, చిరికి వెంకటరమణ, అధికారి శ్రీను, కంకటాల రమేష్, పెదపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘నన్నయ’లో కుసుమ ధర్మన్న జయంతి



డాక్టర్ తరపట్లకు కుసుమ ధర్మన్న సాహితీ సేవ పురస్కారాన్ని అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కుసుమ ధర్మన్న కళాపీఠం (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో కుసుమ ధర్మన్న 125వ జయంతోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు జాతీయ సదస్సు, కవి సమ్మేళనాలను నిర్వహించి, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ‘నన్నయ వర్సిటీ’ వీసీ ఆచార్య కె. పద్మరాజు మాట్లాడారు. రాజమహేంద్రవరం వాసి అయిన కుసుమ ధర్మన్న 125వ జయంతి వేడుకలకు ‘నన్నయ వర్సిటీ’ వేదిక కావడం హర్షనీయమన్నారు. తొలి తెలుగు దళిత కవిగా నిలిచి, సమాజంలోని లోపాల పై కలంతో పోరాటం చేసిన యోధుడన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధాకుసుమ ప్రసంగించారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణకు కుసుమ ధర్మన్న కళాపీఠం ద్వారా సాహితీ సేవ పురస్కారాన్ని అందజేశారు. 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు సమర్పించిన పరిశోధన పత్రాలతో ముద్రించిన పుస్తకాన్ని వీసీ ఆచార్య పద్మరాజు ఆవిష్కరించారు. ఆచార్య డి.జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మద్రాసు యూనివర్సిటీ తెలుగు హెచ్‌ఓడీ ఆచార్య విస్తాలి శంకర్, ఏయు ప్రొఫెసర్ బూసి వెంకటస్వామి, అధ్యాపకులు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్, డాక్టర్ పి. సంజీవరావు, డాక్టర్ కేఎస్‌డీవీ ప్రసాద్, డాక్టర్ తలారి వాసు, డాక్టర్ డి.లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మధురపూడి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు సీపీఐ ఎంఎల్ పార్టీ నేత పలివెల వీరబాబు తెలిపారు. శనివారం ఆయన కోరుకొండలో విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు తెలిపారు. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గానికి సాగునీరు పుష్కలంగా అందిస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని, ఎప్పుడు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల విడుదలకు కృషి చేస్తానని, దళిత వాడల్లో సామాజిక అవకాశాలు నిమిత్తం సామాజిక భవనాలను నిర్మిస్తానని తెలిపారు.

ఆలయాలకు పాలక మండళ్ల ఏర్పాటు




కోదండరామాలయం పాలక మండలి సభ్యులు

కడియం: మండలంలోని వీరవరంలో ఉన్న ప్రముఖ ఆలయాలకు పాలక మండళ్లను శనివారం ఏర్పాటు చేశారు. కోదండరామస్వామి, రామలింగేశ్వరస్వామి వారి ఆలయాలకు కమిటీలను నియమించారు. కోదండరామస్వామి లంక కనకారావు చైర్మన్‌గా, కొత్తపల్లి బ్రహ్మానందం, పెనుగొండ బాలాజీ, పలుకూరి వెంకటరమణ, అడపా నాగసూర్యవతి, బళ్ల పద్మకుమారి, ఇర్లపాటి సత్యవతి, పొన్నాడ నాగవల్లికలు సభ్యులుగా నియమించారు. ఉమారామలింగేశ్వర స్వామి వారి దేవస్థానానికి దొంతంశెట్టి వీరవెంకటేశ్వరరావు చెర్మన్‌గా, పెద్దిరెడ్డి వీర్రాఘవులు, మోతుకూరి సుబ్బారావు, చందన మంగాలక్ష్మ్మి, జక్కం దేవీమల్లేశ్వరి, బాదంపూడి చంటమ్మ, నక్కా పద్మలను పాలకమండలి సభ్యులుగా నియమించారు. నూతన పాలక మండలి సభ్యులతో ఈవో బీవీ సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కొడమంచిలి మహేష్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన పాలక వర్గాలను పూలమాలలతో పలువురు అభినందించారు.

ఎమ్మెల్యేల ప్రొఫైల్

అనపర్తి నియోజకవర్గం



సత్తి సూర్యనారాయణరెడ్డి

అభ్యర్థి పేరు : డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పుట్టిన తేదీ : 31.10.1961

స్వగ్రామం : పొలమూరు, అనపర్తి మండలం

విద్యార్హత : ఎంబీబీఎస్, ఎంఎస్

తండ్రి : సత్తి గంగిరెడ్డి, సీతయ్యమ్మ

భార్య : సత్తి ఆదిలక్ష్మి, ఎం.ఏ(పాలిటిక్స్)

కుమారుడు: డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, ఎంఎస్, ఎంసీఎస్(యూరాలజీ)

విద్యాభ్యాసం : ప్రాథమిక విద్యను పొలమూరు ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేశారు. మధ్యమిక విద్యను అనపర్తి శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేశారు. ఇంటర్ రామచంద్రపురం వీఎస్ఎం కళాశాల, విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో పూర్తి చేశారు.

మెడిసన్ : సిద్ధార్థ మెడికల్ కళాశాల

ఎంఎస్(జనరల్ సర్జన్): జేజేఎం మెడికల్ కాలేజ్, దావణగిరి, కర్ణాటక

వైద్య సేవలు : తన తండ్రి స్వర్గీయ సత్తి గంగిరెడ్డి పేరున 15–11–1991న అనపర్తిలో గంగిరెడ్డి నర్సింగ్ హోమ్ ప్రారంభించారు. అనంతరం 21–06–1995లో నిర్మించిన సొంత భవనంలో (80 పడకల ఆసుపత్రి) వైద్య సేవలు అందిస్తున్నారు.

రాజకీయ సేవలు : 2014 ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్లు తేడాతో పరాజయం పాలైనప్పటికీ 2019 వరకు ప్రతిపక్ష నాయకుడిగా నియోజకవర్గ సమస్యలపై అలుపెరగిన పోరాటం సాగిస్తూ ప్రజల పక్షాన నిలిచిన ఆయనకే 2019 ఎన్నికల్లో పార్టీ అధిష్టానం టికెట్ నిచ్చి రెండోసారి అభ్యర్థిత్వాన్ని ఇచ్చింది. అప్పుడు 55,207 ఓట్లు మెజారీతో గెలుపొంది రాష్ట్రంలో అత్యధిక మెజార్టీ సాధించిన అభ్యర్థుల్లో ఐదో స్థానంలో నిలిచారు. ఎమ్మెల్యేగా ఐదేళ్ల కాలంలో నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, అవినీతి రహితంగా ప్రజలకు ప్రజలకు పారదర్శకపాలన అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు.

రాజానగరం నియోజకవర్గం



జక్కంపూడి రాజా

అభ్యర్థి పేరు : జక్కంపూడి రాజా ఇంద్రవందిత్

విద్యార్హతలు : ఎంబీబీఎస్ డిస్కంటిన్యూ

తండ్రి : జక్కంపూడి రామ్మోహనరావు(లేటు) పూర్వపు కడియం నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్సార్ మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా పనిచేశారు.

తల్లి : జక్కంపూడి విజయలక్ష్మి, 2009 ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగాను, 2014 ఎన్నికల్లో రాజానగరం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగాను ఎన్నికల్లో పోటీ చేసి అపజయం పొందారు. ప్రస్తుతం సంఘ సేవకురాలిగా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలిగా యాక్టివ్ పాత్రను పోషిస్తున్నారు.

భార్య : డాక్టర్ రాజశ్రీ, ఎంబీబీఎస్ పూర్తి చేసి, వివాహం అయిన తరువాత గృహిణిగానే ఉన్నారు. భర్తకు రాజకీయంగా కూడా చేదోడు, వాదోడుగా ఉంటూ గత రెండు సంవత్సరాలుగా రాజానగరం నియోజకవర్గంలో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా ప్రజలకు వైద్య పరంగా సేవలందిస్తున్నారు.

సోదరుడు : జక్కంపూడి గణేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు కోఆర్డినేటర్‌గా పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారు.

రాజకీయ నేపథ్యం : తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగాను, రెండు పర్యాయాలు కేబినెట్ మంత్రిగాను పనిచేశారు. రాజా 2019లో రాజానగరం నియోజకవర్గ శాసన సభ్యులు విజయం సాధించారు.

చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యకలాపాలు : తండ్రి వారసత్వంగా రాజకీయంగా అడుగులు వేస్తూ, నిరంతరం ప్రజలతో మమేకం అవడం చిన్నతనం నుంచి అలవర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో చురుకైన పాత్ర వహిస్తూనే, తండ్రి మరణానంతరం తల్లి విజయలక్ష్మికి అండగా నిలిచారు. రాజమండ్రి, రాజానగరం, కడియం ప్రాంతాల్లో ప్రజలకు కష్ట, సుఖాలలో నేనున్నానంటూ నిలవడంతోపాటు జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోవిడ్ సమయంలో అనేక సేవలందించారు. ఇక రాజానగరం ఎమ్మెల్యేగా గడచిన ఐదేళ్లలో రూ. 1158 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు ప్రభుత్వపరంగా రూ.1146 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి, నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపారు.

ఇతర వివరాలు : తాను ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే తనతోపాటు మరో ఇద్దరు (తల్లి, తమ్ముడు) కూడా మీకు సేవలందిస్తారని 2019 ఎన్నికలలో చెప్పిన విధంగానే చేస్తూ వచ్చారు. గత రెండేళ్లుగా ఆయన సతీమణి డాక్టర్ రాజశ్రీ కూడా నాలుగో వ్యక్తిగా ప్రజలకు వైద్య పరమైన సేవలందిస్తున్నారు.